# మన కోసం మనం

మొన్నొక రోజు ఒక తెలుగు మిత్రుడితో మా ఇంట్లో కూర్చుని టీవీ చూస్తున్నాం. టీవీలో మైథాలజీ మీద జోసెఫ్ కాంబెల్ డాక్యుమెంటరీ ఒకటి వస్తున్నది. మధ్య మధ్యలో మిత్రుడు తన కామెంటరీ ఇస్తున్నా, నేను అతను మాట్లాడుతున్నప్పుడల్లా సౌండ్ కొంచెం పెంచుతూ దీక్షగా చూస్తున్నాను.

డాక్యుమెంటరీలో ఒక చోట హిందూ దేవాలయాలని చూపిస్తున్నప్పుడు, మధుర గాయని సుశీల పాడిన 'కేశోపనిషత్' గీతాలు రసరంజకంగా వినిపిస్తున్నారు. నాకది ఎంతో ఇష్టమైనది కనుక, చేతిలో వున్న పుస్తకం మీద వేళ్ళతో మీటుతూ ఆనందిస్తున్నాను.

మిత్రుడు అన్నాడు 'లతా మంగేష్కర్ ఎంత బాగా పాడిందో చూడండి. అలాటి సింగర్ మన దేశంలోనే లేదు. ఆవిడ గొంతులో మాధుర్యం చూడండి'

'మిత్రుడుగారూ! ఆ పాట పాడింది లత కాదు. సుశీల. మన పి. సుశీల' అన్నాను.

'సుశీలకు అంత మంచి గొంతు ఎక్కడిదండీ. అది లతానే' అన్నాడు.

'లేదు బాబూ. ఆ పాట నా కలెక్షన్‌లో వుంది. అంతేకాదు నా ఉద్దేశ్యంలో సుశీలకన్నా లత గొప్ప సింగర్ కానే కాదు. లత పాటలంటే నా కిష్టమే. అయినా మన దేశంలో లతకన్నా బాగా పాడేవాళ్ళు ఆనాడూ వున్నారు ఈనాడూ వున్నారు. ఎవరి బాణీలో వాళ్ళు గొప్పవాళ్ళు. అంతే!' అంటుండగానే టైటిల్స్ వచ్చాయి.

దాంట్లో పి. సుశీల అని అక్షరాలా లక్షణంగా వ్రాసి వుంది.

O O O

చాల ఏళ్ళ క్రితం శ్రీశ్రీగారు ఒక వ్యాసం వ్రాశారు. ఆయన వ్రాసింది, ఆ వ్యాసం నాకు లభ్యంకాని కారణంగా, నా మాటల్లో వ్రాస్తున్నాను.

నువ్వు తెలుగువాడివిగా తెలుగు దేశంలో పేరు తెచ్చుకోవాలంటే రెండే రెండు పనులు చేయాలి.

ఒకటి, ఏ దూరదేశానికో వెళ్ళి మంచి పేరు తెచ్చుకో. అప్పుడు మనవాళ్ళు 'వీడు... ఎవడు? మన సుబ్బారావ్! ఎంత ఎదిగిపోయాడో చూడు. అమెరికాలో ఒక పెద్ద హైటెక్ కంపెనీకి వైస్ ప్రెసిడెంట్. వెధవ... చిన్నప్పుడు మా రోడ్డు మీద నోట్లో వేలేసుకు తిరుగుతుండేవాడు. అప్పుడు మేమెవరమైనా వీడు ఇంత ఎత్తుకి ఎదుగుతాడని అనుకున్నామా.... లేదు' అంటారు. అతను ఇండియా వచ్చినప్పుడు ఓ చిన్న

సన్మానం చేసినా చేస్తారు. అందరూ గుర్తించాక మనం గుర్తించకపోతే బాగుంటుందా మరి! గురువుగారు ముళ్ళపూడి వెంకటరమణగారూ అదే చెప్పారు, మన తెలుగు వాడు ముందు రచ్చ గెలిస్తే, తర్వాత ఇంట మెచ్చుకుంటారని.

లేదా రెండోది. చచ్చిపో అంటారు శ్రీశ్రీ. అప్పుడు నీకు ఎంతో కీర్తి వచ్చి, నిజంగా కీర్తి శేషుడివయిపోతావు అని.

'అతను బ్రతికి వున్నప్పుడు ఎవరినీ నొప్పించేవాడు కాదు. చచ్చేట్టు కుడుతున్నా కనీసం దోమల్ని కూడా చంపినట్టు నాకు తెలీదు. చాల మంచివాడు. ఏ లోకానికి పోయాడో... ' అని ఎంతో గొప్పగా సానుభూతి వాక్యాలు చెబుతారు. పోయినవాడు గొప్పవాడయితే అతని మరణానికి సంస్మరణలు చేస్తారు. సంతర్పణలు చేస్తారు. ఆత్రేయగారు చెప్పినట్టు, పోయినాళ్ళందరూ మంచోళ్ళు! పోయి మనకి అడ్డం రారు కాబట్టి మంచి వాళ్ళనుకోవాలేమో!

0 0 0

ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే మన తెలుగువాళ్ళని మనమే గౌరవించుకోవటం ఎక్కువగా కనపడదు. గౌరవం మాట వదిలేయండి, కనీసం అగౌరవ పరచకుండా వుంటే చాలు. మన భాష, సంస్కృతిల మీద అభిమానం వుండటం చాల అవసరం. మన మీద మనకి అభిమానం ఉండాలి అంటే, మిగతావాళ్ళ మీద దురభిమానం వుండాలని కాదు. దురభిమానం మంచిది కాకపోవటమే కాక ప్రమాదకరమైనది కూడాను.

కృష్ణదేవరాయలు కన్నడవాడయినా 'దేశ భాషలందు తెలుగు లెస్స' అన్నాడు. మనమేమో 'తెలుగు ఈజ్ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని ఇంగ్లీషులో చెప్పుకుంటాం. ఏం, ఇటాలియన్నే తెలుగు ఆఫ్ ది వెస్ట్ అని అనచ్చు కదూ. అలా మనం అనం. ఎందుకంటే మనం టెలుగూస్ కదా. అందుకు.

బెంగాలీ, తమిళ్, గుజరాతీ, పంజాబీ వాళ్ళ భాషన్నా, సాహిత్యమన్నా... వాళ్ళది ఏదన్నా సరే ప్రాణం పెడతారు. నేను తెలుగువాడినని తెలిసినా, గుజరాతీ ఒక్క ముక్క కూడా రాదని తెలిసినా మా మనీష్ పటేల్ నాతో ఎప్పుడూ గుజరాతీ లోనే మాట్లాడతాడు. ప్రతిసారీ మనీషూ ఇంగ్లీషులో మాట్లాడు అని చెప్పాల్సిందే

'మేము మెడ్రాస్ వెళ్ళామా, అక్కడి టాక్సీవాడు తమిళ్‌లో మాట్లాడతాడు' అని మనవాళ్ళు చేసే అభియోగం. కనీసం మనకి తమిళ్ రాదు, తెలుగువాళ్ళం అని తెలిశాక అతను వచ్చీరాని తెలుగులో మాట్లాడతాడు. అయినా తమిళ్‌నాడు రాజధానిలో తమిళ్ మాట్లాడటంలో తప్పేముంది? మరి మన హైదరాబాద్‌లో టాక్సీ వాళ్ళు ముందు హిందీలో మాట్లాడతారు కదా. మరి మన భాష మీద మనం అభిమానం చూపించకుండా, తమిళ్ వాళ్ళు వాళ్ళ భాష మీద అభిమానం చూపిస్తుంటే మనకి అదేదో తప్పున్నర తప్పులా కనిపిస్తుందేం? అదీ మన తెగులుతనమేనా?

నేను ఆఫీసు పని మీద వెళ్ళిన చైనా, తైవాన్, కొరియా, జపాన్, ఇజ్రాయిల్, ఫ్రాన్స్ మొదలైన దేశాల్లో, వాళ్ళు వాళ్ళ దేశం గురించీ, సంస్కృతి గురించీ, ఆహార వ్యవహారాల గురించీ ఎంత గర్వంగా చెబుతారో! అది మనవాళ్ళల్లో

ఎక్కడో కానీ కనపడదు.

మనకి మనుష్యుల మధ్య గీతలు గీసుకోవటం అలవాటు. దేశంలో అయితే మేము బెంగాలీ, మీరు మద్రాసీ. అదే రాష్ట్రంలో అయితే మేము తెలంగాణా, మీరు ఆంధ్రా. ప్రాంతంలో అయితే మీరు రెడ్డి, మేము కమ్మ. ఒకే కులంలోనే మీరు వైదీకులు, మేము నియ్యోగులం. మధ్యే మధ్యే మేము హిందువులం, మీరు ముస్లిమ్‌లు. ఈ గీతలు పైన చెప్పినట్టు అభిమానంతో గీసుకునేవి కావు. దురభిమానంతో గీసుకునేవి. అందుకనే మనలో మనకి కొట్లాటలు, కొంపలంటించు కోవటాలూ, మారణహోమాలు, మరణాలు.

0 0 0

'ఐ గ్రూ అప్ ఇన్ హైదరాబాద్, ఐ డోంట్ నో తెలుగు వెరీ మచ్. సో ఐ విల్ స్పీక్ ఇన్ ఇంగ్లీష్' అంది ఒక తెలుగు సాహిత్య కార్యక్రమం నిర్వాహకురాలు అమెరికాలోని ఒక పెద్ద నగరంలో.

'మేం తెలుంగు వాళ్ళందా. మా తెలుంగు వేరే మాదిరిగా వుంటాది. మా తాతలు, వాళ్ళ తాతల తాతలు కోయంబత్తూరులో దానే పుడ్చిరి. మా వీట్టులో తెలుంగుదా మాట్లాడేది' గర్వంగా అనేవాడు హ్యూస్టన్‌లో మా ఇంటి పక్కనే వుండే గోపాలస్వామిగారు.

నేను మా ఆస్టిన్‌లో పిల్లలకి తెలుగు పాఠాలు చెబుతుంటే, తన పిల్లాడితో పాటు వచ్చిన మరాఠీ ఆవిడ, ఒక డాక్టర్ గారు - 'భాయ్ సాబ్. నాకు తెలుగు నేర్పిస్తారా, మా ఆయనతో తెలుగు మాట్లాడాలి' అని నా దగ్గర తెలుగు నేర్చుకున్నది. అలాగే ఒక తెలుగు ఆవిడని పెళ్ళి చేసుకున్న అమెరికన్ కూడా తెలుగు నేర్చుకోవాలని నా దగ్గరికి వచ్చాడు.

'మేం తెలుగు సినిమాలు చూడనే చూడం. తెలుగు పాటలు విననే వినం. అన్నీ హిందీవే' అనే ఒకావిడకి నేను వ్రాసిన పుస్తకం 'తెలుగువాడు పైకొస్తున్నాడు తొక్కేయండి' బహుమతిగా ఇచ్చాను చదవమని.

ఆవిడ 'నేను తెలుగు పుస్తకాలు చదవనండీ. అయినా వూరికే ఇస్తున్నారుగా ఇవ్వండి. కాఫీ టేబుల్ మీద పడేస్తే మనవాళ్ళెవరైనా చూస్తారేమో!' అంది.

మన తెలుగావిడ చేత ఒక తెలుగు పుస్తకం చదివించాలనుకున్న నా కోరిక తీరిందో లేదో నాకూ తెలీదు.

ఎందుకంటే, వాళ్ళింట్లో కాఫీ టేబుల్ మీద నేను ఆ పుస్తకాన్ని ఇంతవరకూ చూడలేదు మరి!

0 0 0